క్లుప్తంగా

ఆనకట్ట చెరువుకు నీటి విడుదల



నీటిని మళ్లిస్తున్న పంచాయతీ సిబ్బంది

శిరివెళ్ల: మండల కేంద్రంలోని జనాభాకు తాగు నీటి ఆధారమైన ఆనకట్ట చెరువుకు కేసీ కెనాల్ నీటిని శుక్రవారం విడుదల చేశారు. కేసీ కెనాల్‌కు నీటిని నిలిపివేస్తుండటంతో అధికారుల సూచన మేరకు సర్పంచు సాలమ్మ, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ. అబ్దుల్ సలాం, ఉప సర్పంచు ఇంతియాజ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది చెరువుకు నీటిని మళ్లించారు. ఆనకట్ట చెరువు నిండితే స్థానికులకు మూడు నెలల పాటు నీటి ఇక్కట్లు ఉండవని వారు పేర్కొన్నారు.

మట్టినమూనా పరీక్షలపై అవగాహన



దొర్నిపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మట్టి నమూనా పరీక్షలపై వ్యవసాయ సిబ్బంది, రైతులకు మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ శుక్రవారం అవగాహన కల్పించారు. దొర్నిపాడు-2 వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం పరిధిలో 20 మట్టి నమూనాలను సేకరించారు. వాటిని కర్నూలు ఎఎంసీకి పంపి, ఫలితాల ఆధారంగా రైతు ఏ పంటలు వేయాలి, ఏఏ ఎరువులు వాడాలో సూచిస్తామని చెప్పారు. పరీక్షల వల్ల భౌగోళిక స్థితి, నేల సారవంతం, ఎరువుల వినియోగం వంటి వాటివి తెలుస్తాయన్నారు.

క్లోరినేషన్ తప్పనిసరి

గోస్పాడు: తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలని వ్యవసాయ కళాశాల డీన్ శివశంకర్‌నాయక్ తెలిపారు. మండలంలోని దీబగుంట్ల గ్రామంలో వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నాల్గవ రోజు జాతీయ సేవా పథకంలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద రహదారులను శుభ్రం చేశారు. ఎస్సీ కాలనీలోని వాటర్ ట్యాంకులో క్లోరినేషన్ చేపట్టారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించారు. ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి నారాయణరావు, ప్రొఫెసర్ డాక్టర్లు విజయభాస్కర్, గీతాశిరీష, పీడీ యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బైక్ పై నుంచి పడి ఒకరికి గాయాలు

ఉయ్యాలవాడ : మండలంలోని ఇంజేడు గ్రామ సమీపంలో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న మహమ్మద్ షాకిర్ శుక్రవారం ప్రమాదవశాత్తు కింద పడి గాయాలపాలయ్యాడు. ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన మహమ్మద్ షాకిర్ మాయలూరు గ్రామానికి పని నిమిత్తం వెళ్లి తిరిగి ఆళ్లగడ్డకు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు 108కు సమాచారమివ్వగా వెంటనే సిబ్బంది ఘటనా స్థలికి వెళ్లి ప్రాథమిక చికిత్స నిర్వహించి, మెరుగైన చికిత్స కోసం 108 పైలట్లు రఫీ, షబ్బీర్ ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వైభవంగా శ్రీరాముడి పట్టాభిషేకం



శ్రీరాముడి పట్టాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని నందమూరినగర్‌లో వెలసిన శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని శుక్రవారం వేదపండితుల ఆధ్వర్యంలో 16వ రోజు పండుగతో పాటు స్వామి వారికి పట్టాభిషేకం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజన సేవ అనంతరం పట్టువస్త్రాలతో అలంకరించారు. వేదపండితులు గిరిశర్మ ఆధ్వర్యంలో శ్రీరామ పట్టాభిషేకాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు మురళీకృష్ణ, సూర్యనారాయణ, సుబ్బరాయుడు, మద్దిలేటి, రమణ పాల్గొన్నారు.

అప్రెంటిషిప్‌పై అవగాహన

నంద్యాల(సిటీ): జాతీయ అప్రెంటిషిప్‌పై అవగాహన కార్యక్రమం డోన్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ రాయపురెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17, 18వ తేదీల్లో మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలెప్‌మెంట్ ఎంటర్‌ప్రెన్యూర్, డైరెక్టరేట్ జనరల్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ అప్రెంటిషిప్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి నంద్యాల, కర్నూలు, అనంతపురం, సత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి వ్యాపారవేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు, ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు హాజరవుతారని వివరించారు.

సాంకేతిక ఒడి.. అంగన్‌వాడీ

గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేసిన పౌష్టికాహారం దారి మళ్లుతుందనే ఆరోపణలు వెల్లువెత్తేవి. కొందరు సిబ్బంది రికార్డులు సక్రమంగా నమోదు చేయకపోవడం, వివరాలు అందుబాటులో ఉంచకపోవడంతో ప్రజలకు, అధికారులకు సరైన సమాచారం అందేది కాదు. ప్రపంచం ఆధునికీకరణ స్పీడందుకోవడంతో ప్రభుత్వం కార్యకర్తలకు స్మార్ట్ ఫోన్లను అందజేసి వినియోగం, సమాచారం అప్‌లోడ్‌పై శిక్షణ ఇచ్చింది. ప్రస్తుతం పౌష్టికార నిల్వతో పాటు కేంద్రం పరిధిలోని సమస్త వివరాలు నమోదు చేయిస్తున్నారు. దీంతో పారదర్శకత మెరుగుపడింది. అలాగే ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసేందుకు వీలు కలిగింది.

- ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న ఐసీడీఎస్
- అంగన్‌వాడీ కార్యకర్తలకు స్మార్ట్ ఫోన్ల అందజేత
- వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు
- 16 నుంచి 8కి తగ్గిన దస్త్రాల సంఖ్య
- అక్రమాలను అరికట్టేందుకు తక్షణ అవకాశం



నంద్యాల పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

నంద్యాల: ప్రపంచం ఆధునిక సాంకేతిక ఒడిలోకి చేరుతుంది. ఎక్కడ ఏ సంఘటన జరిగినా క్షణాల్లో అందరికీ తెలిసి పోతుంది. అలాగే క్షేత్ర స్థాయిలో జరిగే లోపాలను సవరించి ప్రజలకు సుపరిపాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కూడా ముందడుగు వేసింది. ఇప్పటికే పారదర్శక పాలన దిశగా మార్పులు చేపట్టింది. ఆయా శాఖలను సాంకేతికత వైపు నడిపిస్తోంది. ఒక్కో ప్రభుత్వ శాఖ ఆధునికీకరణ దిశలో పయనిస్తున్నాయి. ఇంత వరకు దస్త్రాలు కార్యాలయాలకే పరిమితమయ్యాయి. నమోదు చేసుకోవడం, భద్ర పరచడం, ఉన్నతాధికారులు వచ్చినప్పుడు వాటిని పరిశీలించడం వరకే పరిమితమయ్యేవి. ప్రస్తుతం ఆన్‌లైన్ సేవలు వచ్చేశాయి. దీంతో కార్యాలయాల్లో ఏం జరుగుతుందో అంతా క్షణాల్లో ఆన్‌లైన్‌లోకి వెళ్లిపోతుంది. తప్పు చేస్తే సాంకేతికత పట్టేస్తుంది. కొన్ని నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలు కూడా ఆన్‌లైన్ సేవల్లోకి వచ్చేశాయి. ఇందుకు..అంగన్‌వాడీ కార్యకర్తలు, పర్యవేక్షకులకు ఐసీడీఎస్ అధికారులు స్మార్ట్ ఫోన్‌లు అందజేసి, శిక్షణ ఇచ్చారు.

అర్బన్ పరిధిలో..

నంద్యాల అర్బన్ పరిధిలో 107 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. అందులో 3 – 6 సంవత్సరాల చిన్నారులు 1,578, ఆరు నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు 5,983, బాలింతలు 1,086, గర్భిణులు 1,281 మంది ఉన్నారు.

ఎనిమిదికి తగ్గిన దస్త్రాలు..

అంగన్‌వాడీ కార్యకర్తలకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. వీటి వినియోగంపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. వీటిలోనే కేంద్రానికి సంబంధించిన సమస్త సమాచారం పొందు పరచాలి. ఇప్పటి వరకు 16 రకాల దస్త్రాలు, నిర్వహిస్తున్నారు. అవన్నీ చేతితో రాసినవే. ఇక నుంచి రాయాల్సిన పని లేదు. దస్త్రాలు కూడా ఎనిమిదింటికి కుదించారు. అన్ని వివరాలు స్మార్ట్ ఫోన్‌లోనే నమోదుచేయాలి. వివరాలు ఆ శాఖ ఉన్నతాధికారులు చూసేలా అనుసంధానం చేశారు. ఎప్పటికప్పుడు సమాచారం ఆన్‌లైన్‌లో లభ్యమవుతుంది. ఇది అందరికీ అందుబాటులో ఉంటుంది.

> **పనితీరు మెరుగుకు దోహదం**
>
> అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం స్మార్ట్ ఫోన్లు అందజేసింది. వీటితోనే అంగన్‌వాడీకి సంబంధించిన వివరాలు కార్యకర్తలు పంపుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు వీటిపై శిక్షణ ఇవ్వడంతో పనితీరు సులభతరమైంది. స్మార్ట్ ఫోన్ల వల్ల కేంద్రాల పనితీరు ఎప్పటికప్పుడు అంచనా వేసి అవసరమైతే పనితీరు మెరుగు పరచడానికి దోహదపడుతుంది. – చంద్రకళ, సీడీపీఓ, నంద్యాల

లాభాలు..

ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బాలామృతం, పాలు, భోజనం, గుడ్లు, ఇతర పౌష్టికాహారం అందిస్తున్నారు. ఈ ఆహారం ఎంత మందికి అందుతుందో తెలియదు. కొన్ని సందర్భాల్లో వచ్చిన ఆహార పదార్థాలు లబ్ధిదారులకు చేరకుండానే స్వాహా అవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. వారు వచ్చి తీసుకొని వేలిముద్ర వేస్తేనే ఇచ్చేలా ఏర్పాటు చేశారు. బయోమెట్రిక్‌ను ఇందుకు అనుసంధానం చేశారు. అలాగే విద్యార్థులు ఎంత మంది హాజరయ్యారు. ఎంత మంది పౌష్టికాహారం తిన్నారనేది ఫొటో తీయాలి. వాటిని ఆ శాఖ వెబ్‌సైట్‌లో ఉంచాలి. దీని వల్ల అవినీతికి ఆస్కారం చాలా వరకు తగ్గింది. సరుకులు పక్కదారి పట్టే అవకాశం తగ్గింది. చిన్నారులకు దక్కాల్సింది దక్కుతుందని తల్లిదండ్రులు చెబుతున్నారు. అలాగే చేపట్టిన కార్యక్రమాల వివరాలు, అవగాహన కార్యక్రమాలు జరిపిన తీరు, సిబ్బంది చేసిన పనుల వివరాలను నమోదు చేస్తుండటంతో పాదర్శకత మెరుగుపడటమే కాకుండా తక్షణ పర్యవేక్షణ సాధ్యమవుతోంది. తప్పులను వెంటనే సరిదిద్దేందుకు, పునరావృతం కాకుండా చూసేందుకు, మరో చోట అలాంటివి జరగకుండా ఉండేదుకు, పనితీరు మెరుగు పరుచుకునేందుకు దోహదపడుతోంది.

గృహాల మంజూరు

శిరివెళ్ల: మండలానికి కొత్తగా పక్కా గృహాలు మంజూరయ్యాయని హౌసింగ్ ఏఈ అహమ్మద్‌బాషా శుక్రవారం తెలిపారు. రెండో విడత జగనన్న కాలనీలకు ఇళ్లు మంజూరయ్యాని ఇందులో.. కోటపాడుకు 88, జీనేపల్లె 28, వనికినిదిన్నెకు 52 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఎంపికైన లబ్ధిదారుల నుంచి ఆసక్తి పత్రాలను తీసుకుంటున్నామని చెప్పారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు, ఉచితంగా ఇసుక అందజేస్తుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉయ్యాలవాడ : స్థానిక 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 గంటల నుండిచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ గుర్రప్ప తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్

రుద్రవరం: ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆ శాఖ ఏఈ రాఘవేంద్రా రెడ్డి తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, తీగలు ఎన్నో ఏళ్ల క్రితం వేసినవి కావడంతో తుప్పు పట్టి ప్రమాదకరంగా మారాయి. అయితే గత ప్రభుత్వ హయాంలో పట్టించుకోకపోవడంతో అక్కడక్కడా స్తంభాలు కూలడంతో పాటు విద్యుత్ తీగలు తెగి పడుతున్నాయి. అలాంటి వాటిని గుర్తించి కొత్త విద్యుత్ స్తంభాలు వేయించి, కొత్త తీగలు అమర్చుతున్నామని తద్వారా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని చెప్పారు. ఇందులో బాగంగానే మండలంలోని ముత్తలూరులో శుక్రవారం 18 కొత్త స్తభాలు వేయించి 1,400 మీటర్ల పాత తీగలను తొలగించి, కొత్త తీగలు అమర్చామని వివరంచారు.

సంక్షేమానికి అండగా నిలుద్దాం



రుద్రవరంలో సంక్షేమ పథకాల అమలును వివరిస్తున్న దృశ్యం

రుద్రవరం: అన్ని వర్గాల ప్రజలకు నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాకి అండగా నిలుద్దామని పుట్టాలమ్మ క్షేత్ర డైరెక్టర్ గంగిశెట్టి తిమ్మయ్య ప్రజలను కోరారు. నువ్వే మా నమ్మకం జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు స్థానిక ప్రధాన రహదారికిరువైపులా ఉన్న ఇళ్లకు వెళ్లి గతనాకి నేటికీ పాలన తేడాలను వివరించి, అంగీకరించిన వారి నుంచి మిస్డ్‌కాల్ ఇప్పించారు. ఎంపీపీ బాలస్వామి, కొల్లం పుల్లయ్య, నూకల కృష్ణమూర్తి, బైరి హరి,బ్రహ్మం,నంబర్‌వన్ ఉశేని, బాలయ్య, లడ్డన్న,పెద్దన్న,లాజరస్ పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జోరుగా సాగుతోంది. శుక్రవారం క్రిష్టిపాడు, చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లె, గుండుపాపల, దొర్నిపాడు, డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామాల్లో నిర్వహించారు. సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి,యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తులనాగేశ్వరరావు యాదవ్, మోహన్‌నాయుడు లక్ష్మీపార్వతి, హుస్సేన్‌బాషా, వాసు, శ్రీపతి ప్రసాద్, భూమా రామకృష్ణారెడ్డి, మైనుద్దీన్ ఇంటింటికీ జగనన్న పాలనపై అవగాహన కల్పించారు.

కోలుకోలేక యువకుడి మృతి



వీరాంజనేయులు (ఫైల్)

శిరివెళ్ల: పెళ్లి కాలేదని ఆత్మహత్యకు యత్నించిన స్థానిక తెలుగు పేటకు చెందిన గువ్వ వీరాంజనేయులు (25) కర్నూల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు.. పెళ్లి కాలేదని మనస్తాపానికి గురై ఈ నెల 12న పురుగుల మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా,అక్కడ పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహా మేరకు కర్నూల్‌కు తరలించారు. అయినా ఇక్కడ చికిత్స పొందుతూ కోలేకోలేక మృతి చెందాడని ఎస్ఐ చెప్పారు. మృతుడి సోదరుడు విక్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ



అగ్నిమాపక యంత్రాలను పరిశీలిస్తున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా అధిక శాతం అగ్నిప్రమాదాలను నివారించవచ్చని ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఫైర్ స్టేషన్‌లో శుక్రవారం ఫైర్ ఆఫీసర్ వీరారెడ్డి అధ్యక్షతన అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌పీఎస్ కన్వీనర్ల నియామకం

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లా వాల్మీకుల్లో చైతన్యం నింపేందుకు నియోజకవర్గ కన్వీనర్లను ఎంపిక చేసినట్లు వీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులికొండన్న, సంఘం రాష్ట్ర నాయకుడు లాలుస్వామి తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కాశన్న, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, నాగరాజు, మల్లు రాజు, బోయరాముడు, బలరాముడు, నరహరి, భాస్కర్, ఎర్రమల, రామును కన్వీనర్లుగా ఎంపిక చేశామని చెప్పారు.

'బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం'

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేకంగా పాలిస్తున్న కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు అందరూ కలిసిరావాలని కోరారు.ఈ నెల 14 నుంచి 30 వరకు నిర్వహించనున్న ప్రచార ఆందోళన ప్రారంభ సభలో వారు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, అనేక ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు సమాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయని, ప్రజల్లో చైతన్యం కలిగించేందుకే ప్రచార ఆందోళన కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు.నాయకులు నాగరాజు, శ్రీనివాసులు, తోటమద్దులు, ధనుంజయ్, లక్ష్మణ్, పాల్గొన్నారు.

చైతన్యంతోనే హక్కుల సాధన

నంద్యాల(అర్బన్): చైతన్యం ద్వారానే రజకులు హక్కులు సాధించుకోవచ్చని ఏపీ రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి తెలిపారు. స్థానిక విశ్వనగర్‌లో శుక్రవారం సాయంత్రం సంఘం నేతలతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులవృత్తి మీద ఆధారపడి జీవిస్తున్న రజకుల జీవితాల్లో ఎదుగు బొదుగు లేకుండా పోయింన్నారు. వెంకటేశ్వర్లు, నాగరాజు, రాము, రంగనాయకులు, తిమ్మయ్య, నరసింహులు, నారాయణ పాల్గొన్నారు.

ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నంద్యాల(వ్యవసాయం): రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలో ముస్లింలు పలు మసీదుల్లో నాల్గవ శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సహేరి అనంతరం ఉదయం(ఫజర్), మధ్యాహ్నం (జుహురు), మధ్యాహ్నం 3.30గంటలకు (అసర్) ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలో ఆల్ పుర్కానా మైదానం, అంటికోట మసీదు, నూరాని మసీదు, సాయిబాబానగర్‌లోని మజీద్ కుబ్రా(చాంద్‌బాడ) మసీదు, రోజా కుంటలోని ఏరోషన్ మసీదు, బస్టాండ్ వద్ద ఉన్న మసీదుల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు ముస్లింలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. మత పెద్దలు ఖురాన్ బోధనలు, నియామాలు, రంజాన్ మాసం ప్రత్యేకతలను వివరించారు. సాయంత్రం పలు మసీదుల్లో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా రవి



ఎంపీ, పోచా, ఎమ్మెల్యే రవిని ఆహ్వానిస్తున్న దృశ్యం

ముస్లింలకు ఇఫ్తార్



ఇఫ్తార్‌లో పాల్గొన్న మాజీ విప్, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి

శిరివెళ్ల: రంజాన్ ఉప వాస దీక్షలు చేస్తున్న వారికి ఇఫ్తార్ ఇవ్వడం పుణ్యకార్యమని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని యర్రగుంట్లలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గుత్తి రంగయ్య ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సర్పంచు అయ్యలూరి సుభహాన్, ఉప సర్పంచు సత్తార్ ప్రతాపరెడ్డి, ఎంపీటీసీ ఉమ్మిషాగారి సలాం, గంగుల విజయసింహారెడ్డి, నాయబ్ రసూల్, మాజీ మండల మాజీ ఉపాధ్యక్షుడు గాజ కృష్ణారెడ్డి, శంకర్, నాయకులు పూలరామిరెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): పట్టణంలోని గాంధీచౌక్ జుమ్మా మసీదులో శుక్రవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు నివాళి



యూనిటీ ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పారవి.



డీఈఓ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఈఓ అనురాధ



ఆళ్లగడ్డలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి



మాట్లాడుతున్న పీపీ నాగిరెడ్డి

నంద్యాల(అర్బన్)/(వ్యవసాయం)/(సిటీ)/(రూరల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో శుక్రవారం ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.

- బహుజన టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో యూనిటీ వాక్‌ను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఎస్పీజీ మైదానం నుంచి బొమ్మలసత్రం చేరుకొని అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నందమూరినగర్‌లోని స్టార్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో డీఈఓ అనురాధ, ప్రత్యామ్నాయ పాఠశాలల కో ఆర్డినేటర్ రఘురామరెడ్డి పాల్గొని మాట్లాడారు. సుభాష్‌చంద్రబోస్, బుగ్గరాముడు, రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఆర్ఏఆర్ఎస్ ఆధ్వర్యంలో..

ఆర్ఏఆర్ఎస్‌లో ఏడీఆర్ వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్తలు, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, బోధనేతర సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతలమోహన్‌రావు, పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, జిల్లా కోశాధికారి ఎస్‌వైడీ ప్రసాద్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.
- డిజేబుల్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇరిగేషన్ డిపార్టుమెంట్ రిటైర్డు సూపరింటెండెంట్ కాశయ్య, నరసింహులు, అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌వలి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.
- నంద్యాల ఆర్టీసీ డిపో గ్యారేజీలో జిల్లా ప్రజా రవాణా అధికారి టి.శ్రీనివాసులు నివాళులర్పించారు. డిపో మేనేజర్ గంగాధర్‌రావు, అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటినాయుడు పాల్గొన్నారు.
- బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు విజయశేఖర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, రఘుప్రకాష్ ఆధ్వర్యంలో నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించిన గొప్ప మహానుభావుడని, న్యాయవాదులందరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.
- జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యాలయ సూపరింటెండెంట్ లక్కేనాయక్, గోపాల్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ విగ్రహాన్ని పట్టణంలోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్ జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు.
- డ్వామా కార్యాలయంలో పీడీ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో, డీఆర్‌డీఏ పీడీ కార్యాలయంలో పీడీ శ్రీధర్‌రెడ్డి, నూనెపల్లె సమీపంలో ఉన్న పంచాయితీరాజ్ జిల్లా కార్యాలయంలో ఎస్ఈ రాంమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా కార్యాలయంలో ఎస్ఈ మనోహర్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శెట్టి ప్రభాకర్ నివాళులర్పించారు.
- నంద్యాల రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మేనేజర్ షేక్ అబ్దుల్ వాహబ్ స్టేషన్ ఆవరణలో నివాళులర్పించారు.ఆర్‌పీఎఫ్ సీఐ భాస్కర్, జీఆర్‌పీఎస్ ఎస్ఐ జలీల్ పాల్గొన్నారు.
- టెక్కె ప్రాంతంలోనున్న ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ కార్యాలయంలో ఈఈ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఏడీఈలు ఆంథోనిరాజు, సతీష్‌కుమార్‌రెడ్డి, ఏఈలు నాగరాజు, రామయ్య, రవికుమార్, శ్రీనివాసులు, సుబ్బారావు నివాళులర్పించారు.
- ఎస్టీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అజాంబేగ్, రాష్ట్ర సహ అధ్యక్షుడు చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ, నాగేంద్ర, దేవేందర్, పీఆర్‌టీయూ కార్యాలయం లో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు ఆధ్వర్యంలో భాస్కరరెడ్డి, విజయరావు, సుమయూన్, జగదీష్, నరసింహులు, నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ నివాళులర్పించారు.

దొర్నిపాడు: మండలంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు అయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ నాగఅనసూయ, సర్పంచ్‌లు పద్మిని, దేవమణి, శివరామిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఓబులేసు, టీఏ రాంబాబు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ భూమా శ్రీనివాసరెడ్డి, నాగేష్, జక్కుల రాముడు, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

శిరివెళ్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నాయక్ వసీం, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, పంచాయతీ కార్యాలయంలో సర్పంచు సాలమ్మ, యర్రగుంట్ల కళాశాలలో ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, ఉప సర్పంచు ఇంతియాజ్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓ ఆర్డీ సాల్మన్‌రాజు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, కార్యాలయ సూపరింటెండెంట్ సత్యన్న, ఉపాధి సిబ్బంది, పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ కొండారెడ్డి, సుబ్బారెడ్డి, సిబ్బంది, ఎస్సీ కాలనీలో జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు ఓబులేస్, గ్రామ సచివాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఆళ్లగడ్డ: అంబేడ్కర్ ఆశయాలు జాతికి స్ఫూర్తిదాయకమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, చెన్నయ్య ఉన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్బారెడ్డి నివాళులర్పించారు.

గోస్పాడు: బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం దీబగుంట్లలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు చిన్ననాగిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, రిటైర్డు వీఆర్‌ఓ పాల్గొన్నారు.